రైతుసంఘం జిల్లా మహాసభ వాయిదా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఈ నెల 30, 31వ తేదీల్లో జంగారెడ్డిగూడెంలో నిర్వహించనున్న రైతు సంఘం జిల్లా మహాసభను మొంథా తుపాన్ నేపథ్యంలో వాయిదా వేస్తున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తుపాన్ కారణంగా పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. తుపాను ప్రభావం తీవ్రంగా ఉండటం, రైతులు ఇబ్బందుల్లో ఉన్న నేపథ్యంలో రైతు సంఘం మహాసభ వాయిదా వేసినట్లు చెప్పారు. మహాసభ తేదీలను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. మహాసభ వాయిదా వేసిన విషయాన్ని రైతులు గమనించాలని కోరారు. తుపాన్ కారణంగా నష్టపోయిన పంటల రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరి, పత్తి, మినుము, కూరగాయలు తదితర పంటలకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. పంట నష్టాలు నమోదు చేసి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

ముంచిన మొంథా

- తీరం దాటినా వీడని ముప్పు
- ఈదురుగాలులు, వర్షాలతో స్తంభించిన జన జీవనం
- పలుచోట్ల నేలకొరిగిన చెట్లు, ప్రమాదకర స్థాయిలో చెరువులు
- ఏలూరులో 45 పునరావాస కేంద్రాలు, 1203 మంది తరలింపు
- పశ్చిమలో 37 కేంద్రాలు, 4,155 మందికి పునరావాసం
- పశ్చిమ తీర ప్రాంతంలో భయానక పరిస్థితి
- సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మొంథా తుపాన్ ప్రజలు, అధికారులకు కునుకు లేకుండా చేసింది. తుపాన్ ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి ఈదురుగాలులు, వర్షాలతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో జనజీవనం స్తంభించింది. అవసరమైతే తప్ప జనం ఇళ్లు విడిచి బయటకు రాని పరిస్థితి నెలకొంది. మంగళవారం అర్ధరాత్రి సమయంలో తుపాన్ నరసాపురం-కాకినాడ మధ్య తీరం దాటుతుందని ఆ ప్రభావం పశ్చిమ, ఏలూరు జిల్లాలపై ఎక్కువగా కన్పిస్తోంది. తీర ప్రాంతంలో మంగళవారం సాయంత్రానికి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో అక్కడి ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తుపాను నష్టనివారణ, సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం పూర్తిగా నిమగ్నమైంది. పశ్చిమగోదావరి జిల్లాలో తుపాన్ ప్రభావిత 70 ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇప్పటి వరకూ మొత్తం 37 పునరావాస కేంద్రాలకు 4,155 మందిని తరలించి భోజన ఏర్పాట్లు చేశారు. అవసరమైతే మరో 9,409 కుటుంబాలను తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నరసాపురం డివిజన్‌లో 6,500 కుటుంబాలను, తాడేపల్లిగూడెం డివిజన్‌లో 1,350, భీమవరం డివిజన్‌లో 1,559 కుటుంబాలను గుర్తించారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటికే 3,481 ఎకరాల్లో వరిపంట దెబ్బతింది. ఈదురుగాలులకు వరిపొలాలు నేలనంటాయి. భారీ వర్షాలు కొనసాగితే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఏలూరు జిల్లాలో మొత్తం 82 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇప్పటి వరకూ 20 మండలాల పరిధిలో 45 పునరావాస కేంద్రాలకు 1,203 మందిని తరలించారు. ప్రమాదం పొంచి ఉన్న 120 చెరువులను గుర్తించి చర్యలు చేపట్టారు. కలిదిండి, ముసునూరుల్లో రెండు చెరువుల్లో ప్రమాదకర స్థాయికి నీరు చేరడంతో తగిన చర్యలు చేపట్టారు. రోడ్లు, కల్వర్టులు, కాజ్‌వేల వద్ద పికెట్లు ఏర్పాటు చేశారు. టెలికాం సేవలకు అంతరాయం లేకుండా టవర్ల వద్ద జనరేటర్లు ఏర్పాటు చేశారు.

చలిగాలులు.. వర్షం

తుపాన్ ప్రభావంతో పూర్తిగా చీకటి కమ్ముకున్నట్లుగా మారింది. ఈదురుగాలులు, వర్షాలకు చలి విపరీతంగా పెరిగింది. దీంతో జనం బయటికి రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. చలిగాలులకు ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉండటంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. రెండు జిల్లాల కలెక్టర్లు అధికార యంత్రాంగంతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లపై అధికారులు మరింత దృష్టి సారించాల్సి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి నాదెండ్ల

ప్రజాశక్తి - మండవల్లి

తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టిందని, పూర్తిగా అండగా ఉంటుందని ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మండలంలోని తుపాను ప్రభావిత ప్రాంతాలను మంత్రి జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావంతో వీస్తున్న గాలులు, వర్షాలకు ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. ఇప్పటివరకూ సురక్షిత ప్రాంతాలకు ఎంతమందిని తరలించారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల వెంబడి రోడ్డు పక్కన పశువులను కట్టి ఉంచిన విధానంపై ఆయన అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఎటువంటి ప్రాణ నష్టం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. వాట్సప్‌లో పెట్టాం, మైక్‌లో చెప్పించామంటే సహించేది లేదని, నేరుగా వెళ్లి తెలుసుకుని సమాచారం అందించాలన్నారు. అనంతరం కొల్లేరును పరిశీలించారు. ఆయన వెంట ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, రెడ్డి కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటలక్ష్మి, ఆర్‌టిసి డైరెక్టర్ రెడ్డి అప్పలనాయుడు, నల్లగోపుల చలపతి, ఆర్‌డిఒ అంబరీష్ తహశీల్దార్ కె.గోపాల్ పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

మినప రైతులను ఆదుకుంటాం

మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మినప రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. మంగళవారం రామన్నగూడెంలో ముంపుకు గురైన మినప పొలాలు మంత్రి పార్థసారథి పరిశీలించి రైతుల కష్ట నష్టాలను తెలుసుకొని నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. త్వరలో నిబంధనలను అనుసరించి ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందన్నారు. తన నియోజకవర్గంలో ఏ ఒక్క రైతూ, కార్యకర్తా, ప్రజలు ఏ విధంగా నష్టపోవడానికి వీల్లేదని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. కట్ట తెగిపోయిన చెరువుల వద్ద తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలు సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని, అధికారులు చెప్పే సూచనలు తూచా తప్పకుండా పాటించాలని కోరారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ ఆర్‌అండ్‌బి అధికారులు ఎప్పటికప్పుడు గట్లు తెగిన చెరువుల వద్ద నిఘా పెట్టాలని, ఎలాంటి ప్రాణనష్టమూ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా అధికారులు, తహశీల్దార్, మండలస్థాయి అధికారులు ఉన్నారు.



మినప పంటను పరిశీలిస్తున్న మంత్రి

పోలీసు శాఖ తుపాన్ ప్రత్యేకాధికారిగా ఆక్టోపస్ డిఐజి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా తుపాను ప్రత్యేక అధికారిగా ఆక్టోపస్ డిఐజి సెంథిల్ కుమార్ నియమితులయ్యారు. మంగళవారం రాత్రి ఆయన ఏలూరు జిల్లా ఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, ఇడిఆర్‌ఎఫ్ బృందాలు డ్రోన్ల సహాయంతో తుపాను ప్రభావిత ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయన్నారు. వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నేరుగా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పిని సెంథిల్‌కుమార్ అభినందించారు.

ఎస్‌పిచే పునరావాస కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ తనిఖీ చేశారు. ప్రజలకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. బాధితులతో స్వయంగా మాట్లాడి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చేశారా, లేదా అని తీశారు. భోజనం నాణ్యత, సరైన సమయానికి పంపిణీ గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట చేబ్రోలు ఎస్‌ఐ సూర్యభగవాన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పునరావాస కేంద్రంలో ఎస్‌పి

నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు తుపాన్ కారణంగా ఈ నెల 29వ తేదీ బుధవారం సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని డివైఇఒలు, ఎంఇఒలు ఈ మేరకు చర్యలు తీసుకోవాలని, ఏ ప్రయివేటు పాఠశాల కూడా అదనపు తరగతుల పేరుతో ఎటువంటి తరగతులూ నిర్వహించరాదని, ఈ ఆదేశాలను పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధితులకు అసౌకర్యం లేకుండా చర్యలు

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

తుపాను పునరావాస కేంద్రాల్లో బాధితులకు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని కంట్రోల్ రూమ్ నుండి మంగళవారం నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో టెలి కాన్ఫరెన్స్ ద్వారా తుపాను పరిస్థితి, సహాయక కేంద్రాల్లో బాధితులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో తుపాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించామని, వారికి భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, టాయిలెట్లు పరిశుభ్రంగా ఉండాలని, పరిసరాలలో వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో వర్షం కారణంగా పొంగుతున్న వాగులు, చెరువులను గుర్తించి, ప్రమాదస్థాయికి చేరుకున్న వాటికి గండ్లు కొట్టాలని, గండ్లు కొట్టే సమయంలో కింద ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పెనుగాలుల కారణంగా రహదారికి అడ్డుగా పడిన చెట్లను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి : జెసి

ప్రజాశక్తి - మండవల్లి

తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు కొల్లేరు పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ తెలిపారు. మండలంలోని పెద్ద ఎడ్లగాడి వంతెన వద్ద కొల్లేరులో మేటవేసిన తూడు, గుర్రపు డెక్కను, మునిగిన పెద్దఎడ్లగాడి-పెనుమాక లంక రోడ్డును ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ కొల్లేరు పరివాహక గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలన్నారు. మత్స్యకారులు కొల్లేరులో చేపల వేటను పూర్తిస్థాయిలో నిలుపుదల చేయాలన్నారు. పెద్దఎడ్ల గాడి వంతెన వద్ద మేటవేసిన తూడు, గుర్రపుడెక్క వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, తహశీల్దార్ గోపాల్, మాజీ సర్పంచి సుగుణరావు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు

ప్రజాశక్తి - మండవల్లి

మొంథా తుపాను ప్రభావానికి ప్రజలు గజగజ వణుకుతున్నారు. గాలులు, వర్షానికి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తుపాను ప్రభావానికి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తమయ్యారు. ఎటువంటి ప్రాణ నష్టం సంభవించకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టారు. కొల్లేరు పరివాహక లోతట్టు గ్రామాల్లో పది చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే భైరవపట్నం, లింగాల గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్తిపాడు వద్ద నివాసముంటున్న నక్కల కుటుంబాలకు చెందిన సుమారు 60 మందిని లింగాలలో సుమారు 10 మందిని పునరావాస కేంద్రానికి తరలించి, భోజన వసతి అందించేలా చర్యలు చేపట్టారు. ప్రమాదాలు సంభవించకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తహశీల్దార్ గోపాల్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండవల్లి మండలంలో అన్ని ఏర్పాట్లూ చేశామని తెలిపారు. ఇప్పటికే రెండు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి సుమారు 70 మందిని తరలించి వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు.

నా ఇల్లు బాగోక పునరావాస కేంద్రానికి వచ్చా..

పోసిన యాదగిరి, లింగాల

నా ఇల్లు సరిగ్గా లేదు. దీంతో అధికారులు నా దగ్గరకు వచ్చి లింగాల హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తీసుకొచ్చారు. మధ్యాహ్నం మంచి భోజనం పెట్టారు. నాతోపాటు మరి కొంతమంది కూడా ఇక్కడే ఉన్నారు.

భోజనం ఏర్పాట్లు చేశారు..

గుజరాత్ బద్రి

నేను నక్కల కుటుంబాలకు చెందిన వాడిని. 20 ఏళ్ల నుండి ప్రత్తిపాడు స్టేజీ వద్ద నివాసాలు ఏర్పాటు చేసుకుని 30 కుటుంబాల వారం జీవిస్తున్నాం. తుపాను వస్తుందని పునరావాస కేంద్రానికి రావాలని అధికారులు చెప్పారు. భైరవపట్నం హైస్కూల్లో ఏర్పాటు చేసిన పురావాస కేంద్రానికి మమ్మల్ని తరలించారు. సుమారు 60 మందికి భోజనం ఏర్పాట్లు చేశారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు

తుపాన్ పర్యవేక్షణ ప్రత్యేకాధికారి కాంతిలాల్ దండే

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని తుపాన్ పర్యవేక్షణ ప్రత్యేక అధికారి కాంతిలాల్‌దండే తెలిపారు. జిల్లా కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం మొంథా తుపాన్ ప్రభావితంపై ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి, ఏలూరు తుపాన్ పర్యవేక్షణ ప్రత్యేక అధికారి కాంతిలాల్ దండే, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా అధికారులతో శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కాంతిలాల్ దండే మాట్లాడుతూ జిల్లాలో 2.2 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోందని, వారం తరువాతగాని వరి కోతలు ఉండనందున ఎటువంటి నష్టమూ ఉండదన్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ తుపాన్ నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాల కారణంగా ఇంకా ఎక్కడైనా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి వస్తే అధికారులు అందుకు తగిన విధంగా ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. శిబిరాల వద్ద తాగునీరు, భోజన సౌకర్యం, పాలు, మెడికల్ క్యాంపు, శానిటేషన్ నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల వద్ద విద్యుత్తు అంతరాయం లేకుండా జనరేటర్లను సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంతిలాల్ దండే

భీకర గాలి, వాన

పునరావాస కేంద్రాలకు జనం తరలింపు

నేలనంటిన వరి పైరు

కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మొందా తుఫాన్ మండలంలో తీవ్ర ప్రభావం చూపింది. ఉదయం నుంచి రాత్రి వరకు వర్షంతోపాటు భీకర గాలులు వీయడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గాలులకు రహదారులపై చెట్లు విరిగిపడ్డాయి. ముదినేపల్లి, దేవపూడి, స్తంభం చెరువు తదితర గ్రామాల వద్ద గాలికి చెట్లు విరిగిపడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఎస్‌ఐ వెంటనే చెట్లు తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. పెదపాలపర్రు, దేవపూడి, పెదకావునపూడి, వడాలి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. అనేక గ్రామాల్లో వరి చేలు నేలనంటాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. చేవూరు వైఎస్ఆర్ కాలనీలోకి భారీగా నీరు చేరింది. విద్యుత్ తీగలు తెగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రొద్దువాక, వడాలి పునరావాస కేంద్రాలను జెడ్‌పి సిఇఒ శ్రీహరి, మండల ప్రత్యేక అధికారి యోహాన్, తహశీల్దార్ లతీఫ్ పాషా సందర్శించి వసతులను పరిశీలించారు. భోజన ఏర్పాట్లు పర్యవేక్షించారు. మండలంలోని పలు డ్రెయిన్లను జెడ్‌పి సిఇఒ శ్రీహరి పరిశీలించారు పేరూరు, దాకారం, ఉప్పరగూడెం, శ్రీహరిపురం వద్ద పంట కాలవల్లో, డ్రెయిన్లలో వంతెన వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగింపజేశారు.

ముదినేపల్లిలో..

కలిదిండిలో..

ఏలూరు సిటీ: మొంథా తుపాన్ ప్రభావంతో ఏలూరు నగరంలో మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. మంగళవారం రాత్రికి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ముందస్తు చర్యల్లో భాగంగా ఏలూరు మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. వన్‌టౌన్ ప్రాంతంలోని అగ్రహారంలోని కస్తూరిబా పాఠశాల, తంగెళ్లమూడిలోని మసీదు వద్ద రెండు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో తాత్కాలిక ఆశ్రయం కోసం అవసరమైన సదుపాయాలు, అలాగే వైద్య సేవల కోసం మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాణీనగర్, తంగెళ్లమూడి ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. వారికి మూడు పూటలా భోజనం, తాగునీరు అందించేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. తుపాన్ కారణంగా నగరంలోని పలు రోడ్లు జలమయమై వాహన రాకపోకలకు అంతరాయం కలిగించాయి. మరో వైపు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పరిస్థితిని పర్యవేక్షిస్తూ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కలిదిండి: చిరుజల్లులతో కూడిన భారీ ఈదురు గాలులకు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. షాపుల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఎగిరిపోయాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 24 కుటుంబాలకు పునరావాసం కల్పించారు. తహశీల్దార్ ఎల్‌వి‌ఎస్.రామకృష్ణ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. చేపల చెరువుల వద్ద తూములు తెరిచి ఉంచి, అధిక వర్షం వచ్చినా గట్లు తెగిపోకుండా ముందస్తు జాగ్రత్తల్లో ఆక్వా రైతులు నిమగ్నమయ్యారు. లోడిదలంకతో పాటు పలు లంక గ్రామాల్లో ఈ ఒక్క రోజే సుమారు వంద ఎకరాల్లో పట్టుబడులు పట్టి ఐనకాడికి అమ్ముకున్నారని పలువురు ఆక్వా రైతులు తెలిపారు. ధర లేక ఖర్చులు కూడా రాలేదని వాపోయారు. మరో రెండు రోజులు ఇదే వాతావరణం కొనసాగితే అమ్ముకోవడానికి రొయ్యలు కూడా దక్కవన్నారు. గుర్వాయిపాలెంలోని సుమారు ఏడు ఎకరాల శ్మశానం నీటితో నిండి చెరువును తలపిస్తోంది. ఎస్‌ఆర్‌పి అగ్రహారంలో వృక్షాల భారీ కొమ్మలు విరిగి రాష్ట్రీయ రహదారిపై పడ్డాయి. కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పంచాయతీ సిబ్బంది వాటిని తొలగించారు.

జంగారెడ్డిగూడెం: మొంథా తుపాన్ ప్రభావంతో జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలోని వేగవరం, జల్లేరు, పట్టిసపాలెంలో అధికారులు అప్రమత్తమయ్యారు. పలు లోతట్టు ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. వాగుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయగా, ఎర్రకాలువ జలాశయంలోకి మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిశీలించిన వారిలో జెడ్‌పిటిసి పోల్నాటి బాబ్జి, తహశీల్దార్ స్లీవజోజి, ఎంపిడిఒ కృష్ణ ప్రసాద్, సిఐ శుభాష్, ఎస్‌ఐ జబీర్ ఉన్నారు.

ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు

ముసునూరు : తుపాన్ నేపథ్యంలో వరి, మినుము, పత్తి వంటి పంటలు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని, ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు తెలిపారు. మంగళవారం మండలం పరిధిలోని ముసునూరు, చింతలవల్లి, గోగులంపాడు, సింహాద్రిపురం, కొర్లకుంట గ్రామాల్లో సిపిఎం బృందం ఆధ్వర్యంలో మినుము, వరి, పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట చేతికొచ్చే సమయంలో తుపాను రావడం వల్ల రైతులు చాలా నష్టపోయే పరిస్థితి ఉందని, రైతులు ఆందోళన చెందొద్దని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఒక్కో రైతు సుమారు ఎకరాకు రూ.40 వేలకు పైగా పెట్టుబడి పెట్టారని, ఒక్క రూపాయి కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి, పంట నష్ట పరిహారం అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు సిహెచ్.శ్రీనివాస్, కంచర్ల రమేష్, కంచర్ల దుర్గారావు, కొండబోయిన గంగరాజు, నాగేశ్వరరావు, వీరన్న పాల్గొన్నారు.



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

రేషన్ వ్యాన్‌లో విద్యార్థుల తరలింపు

ఇళ్లకు హాస్టల్ విద్యార్థులు..!

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని హాస్టళ్లలో విద్యార్థులను ఇళ్లకు పంపించేశారు. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండేలా, ముందు జాగ్రత్తగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని హాస్టళ్లలోని విద్యార్థులను తమ తమ ఇళ్లకు పంపించారు. వేలేరుపాడు మండలానికి సంబంధించిన విద్యార్థులను బూసరాజుపల్లి నుండి బియ్యం పంపిణీ వ్యానుల్లో తరలించారు.

6న ఏలూరులో 'సోషలిజం ఆవశ్యకత'పై సదస్సు

హాజరుకానున్న సీనియర్ నేత బివి.రాఘవులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నవంబర్ 6న ప్రపంచ పరిణామాలు - సోషలిజం ఆవశ్యకత అంశంపై ఏలూరులో జరిగే రాష్ట్ర సదస్సుకు సిఐటియు ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బివి.రాఘవులు ముఖ్యవక్తగా హాజరై ప్రసంగిస్తారని సిఐటియు ఏలూరు నగర కమిటీ తెలిపింది. ఈ మేరకు సంఘం నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైఎస్.కనకారావు, మంచెళ్ల ఇస్సాకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిఐటియు అఖిలభారత మహాసభలు డిసెంబర్ 28 నుండి జనవరి 4వ తేదీ వరకూ విశాఖపట్నంలో తొలిసారి జరగబోతున్నాయని చెప్పారు. ఈ మహాసభ సందర్భంగా ఉద్యోగ, కార్మిక, కర్షకులకు సోషలిజం ఏ విధంగా ప్రత్యామ్నాయ విధానాలు చూపుతుందో తెలియజెప్పేందుకు రాష్ట్ర సదస్సును ఏలూరులో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కీలక అంశంపై ఉపన్యాసం ఇచ్చేందుకు సిఐటియు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి బివి.రాఘవులు ఏలూరు విచ్చేస్తున్నారని చెప్పారు. నవంబర్ 6న ఏలూరు సీతారాం భర్తీయా మర్చంట్ ఛాంబర్స్ కళ్యాణ మండపంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని, జిల్లా నలుమూలల నుండి కార్మిక వర్గ ప్రతినిధులు దాదాపు 600 మంది హాజరవుతారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం శరవేగంగా అమలు చేస్తోందని చెప్పారు. ఇటువంటి కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని తెలిపారు. ప్రపంచంలో సోషలిజం ఆవశ్యకతను కార్మిక వర్గం అవగాహన చేసుకోవాలని, నిర్వహించే ఈ సదస్సును కార్మిక వర్గం అంతా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అధ్యక్షత వహిస్తారని జిల్లా ప్రభుత్వాసుపత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్, జెవివి పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్.రమేష్ తదితరులు సదస్సులో పాల్గొని ఉపన్యసిస్తారని పేర్కొన్నారు.

ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

నూజివీడు-ఏలూరు రోడ్డును నిర్మించాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - ముసునూరు

నూజివీడు నుంచి సింహాద్రిపురం మీదుగా ఏలూరు వెళ్లే ప్రధాన రహదారి గోతులతో అధ్వానంగా ఉందని, ఆ రోడ్డుకు మరమ్మతులైనా చేయాలని లేదా కొత్త రోడ్డు నిర్మించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల పరిధిలోని సింహాద్రిపురం గ్రామంలో రహదారిపై ఉన్న పెద్దపెద్ద గోతుల వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ రోడ్డు అనేక ఏళ్ల నుంచి పెద్ద పెద్ద గోతులతో పాడైపోయి చాలా అధ్వానంగా ఉన్నప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి రెండేళ్లవుతున్నా రోడ్డు నిర్మాణానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఈ రోడ్డును పరిశీలించాలని, నూతన రోడ్డు నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో రహదారులకు మరమ్మతులు చేస్తామని, కొత్త రోడ్ల నిర్మాణం చేపడతామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకొచ్చి రెండేళ్లవుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. నూజివీడు నుంచి సింహాద్రిపురం మీదుగా జిల్లా కేంద్రం ఏలూరు వెళ్లే రోడ్డు నిర్మాణం చేపట్టకపోతే గ్రామంలోని ప్రజలందరినీ సమీకరించి సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్, సిపిఎం నాయకులు సిహెచ్.శ్రీనివాస్, కంచర్ల రమేష్, కంచర్ల దుర్గారావు వీరన్న, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వంగాయగూడెం రోడ్డును నిర్మించాలి

జోరువానలో స్థానికుల ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దారుణమైన గోతులతో అధ్వానంగా మారి నిత్యం ప్రమాదాలకు కారణం అవుతున్న వంగాయగూడెం కేన్సర్ ఆసుపత్రి రోడ్డును తక్షణమే నిర్మించాలని కోరుతూ స్థానికులు మంగళవారం జోరువానలో ఆ రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు చీరా జయ, కోన బాలు, పరస వెంకటరామకుమార్, తలారి ప్రవీణ్‌కుమార్, బాలకృష్ణ, బాలు, కాటం మాధవి మాట్లాడుతూ ఏళ్ల తరబడి అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రోడ్డు వైపు కన్నెత్తి చూడలేదన్నారు. భారీ ఎత్తున రోడ్డుపై గోతులు పడి, వర్షాలకు ఆ గోతుల్లో నీరు నిలిచిపోయి ప్రతిరోజు ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని, కనీసం తమ పిల్లలు పాఠశాలలకు కూడా వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు పాలకులకు, అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని, ఈ రోడ్డుపై నిత్యం వందలాదిమంది స్కూల్ పిల్లలు, ఉద్యోగులు, వ్యాపారులు సంచరిస్తూ ఉంటారని, ముఖ్యంగా కేన్సర్ రోగులు, ఇతర రోగులు కేన్సర్ ఆసుపత్రికి వచ్చే క్రమంలో వారంతా ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారని తెలిపారు. అడుగు బయట పెడితే ఎక్కడ ఏ గోతిలో పడి కాలు విరుగుతుందో అన్నట్లుగా పరిస్థితి ఉందని, అయినప్పటికీ పాలకులకు చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. తక్షణం రోడ్డును నిర్మించకపోతే రానున్న కాలంలో మరిన్ని ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. అయితే రోడ్డుపై ధర్నా చేస్తున్న క్రమంలో పోలీసులు రంగప్రవేశం చేసి తుపాన్ సమయంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా ధర్నా చేయటం సరికాదని, వెంటనే ధర్నా విరమించకపోతే కేసులు పెడతామని బెదిరించడంతో స్థానికులు ధర్నా విరమించారు. అయితే కొంతమంది మహిళలు మాత్రం ఇంత అధ్వానంగా ఉన్న రోడ్డు చూసి కూడా తమపై కేసులు పెడతామని బెదిరిస్తున్న మీరు పాలకులను ఎందుకు నిలదీయరని పోలీసులను గట్టిగానే ప్రశ్నించారు.

ధర్నా చేస్తున్న స్థానికులు

వెంటనే రోడ్డు నిర్మించాలి : సిపిఎం

జిల్లా కేంద్రం ఏలూరులో వంగాయగూడెం కేన్సర్ హాస్పటల్ రోడ్డు నిర్మాణం తక్షణం చేపట్టాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ నగర కార్యదర్శి పంపన రవికుమార్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏలూరు నగరంలో వంగాయగూడెం క్యాన్సర్ హాస్పిటల్ రోడ్డు సహా పాడైపోయిన పలు రోడ్లు నిర్మించాలని సిపిఎం ఆందోళన చేస్తుందని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణం కోసం స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఏలూరు ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో రోడ్ల నిర్మాణంపై పని చేయాలని, వంగాయిగూడెం రోడ్డు కోసం ఆందోళన చేస్తున్న ప్రజలకు సిపిఎం సంఘీభావాన్ని, మద్దతును తెలియజేస్తుందని పేర్కొన్నారు. ప్రజల కనీస అవసరమైన రోడ్డు కోసం ఆందోళన చేస్తున్న ప్రజలను పోలీసులతో భయపెట్టే ప్రయత్నించడం మానుకోవాలని తెలిపారు. స్థానిక ప్రజల ఆందోళనలతో అయినా ప్రభుత్వం దిగివచ్చి రోడ్డు నిర్మించకపోతే సిపిఎం నిరవధిక ఆందోళనకు దిగుతుందని పేర్కొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి : ఎంఎల్‌ఎ బడేటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పేదలకు కూడు, గూడు, గుడ్డ అనే బలమైన నినాదాలనే సైద్ధాంతిక పరమైన విధానాలుగా ఎంచుకుని నవ్యాంధ్ర దశ-దిశను మార్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. అదేలక్ష్యంతో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో పేదలందరికీ ఇళ్లు అనే బృహత్తర కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం కొంతమంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలుచేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా గృహ లబ్ధిదారులకు మరింత మేలు చేకూర్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు.

నేరాలు - ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

ఉంగుటూరు :మండలంలోని గొల్లగూడేనికి చెందిన వివాహిత వెదురుపావులూరి జీవామణి (33) తీవ్రమైన కడుపునొప్పి తాళలేక పురుగుమందు తాగి ఆపై బాధ తట్టుకోలేక ఆమె ఇంటికి సమీపంలో ఉన్న పంచాయతీ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘనటా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సూర్యభగవాన్ తెలిపారు. మృతురాలి భర్త శ్రీహరి గోపాలమిత్రగా పశువైద్యం చేస్తుంటారు.

రావిచర్లలో ఎక్సైజ్ దాడులు

నూజివీడు టౌన్ :మండలంలోని రావిచర్ల గ్రామంలో ఎక్సైజ్ సిబ్బంది మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో దుడిగల శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వైవిఎన్ఎస్.ప్రభుకుమార్, సిబ్బంది మేతుకుమల్లి వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతని పై కూడా కేసు నమోదు చేశారు. అనంతరం రావిచెర్ల గ్రామానికి చెందిన మరీడు మల్లికార్జునరావు, యార్లగడ్డ కృష్ణ, దుడిగల శ్రీనివాసరావు ముగ్గురు నిందితులను నూజివీడు తహశీల్దార్ (మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్) ఎదుట హాజరుపరిచగా బైండోవర్ విధించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఒక సంవత్సర కాలపరిమితిలోపు మళ్లీ ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే వారికి రూ.లక్ష జరిమానా విధించటంతో పాటు, ప్రభుత్వ పథకాల నుంచి కూడా అర్హత రద్దు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని మద్యం షాపుల్లో నిర్వహించిన తనిఖీల్లో భాగంగా రసాయన పరీక్షల నిమిత్తం బాటిల్స్‌ను శాంపిల్‌గా తీసుకున్నామని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అప్రమత్తత, జాగ్రత్తలతోనే రక్షణ

మొంథా తుపాన్ నేపథ్యంలో ప్రజలకు ప్రజాప్రతినిధులు, పోలీసులు, అధికారుల సూచనలు

ముందస్తు చర్యలు తీసుకున్నామని స్పష్టం

అండగా ఉంటామని భరోసా

ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

తుపాన్ సహాయక కార్యక్రమాల్లో ప్రభుత్వ ప్రతిష్ట ఇనుమడింపచేసేలా అధికార యంత్రాంగం పని చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశపు హాలులో మంగళవారం సాయంత్రం తుపాన్ పరిస్థితి, సహాయక చర్యలపై అధికారులతో మంత్రి పార్థసారధి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాల కారణంగా ముంపు ప్రమాదం ఉన్న ప్రతి ప్రాంతంలోని ప్రజలను వెంటనే తుఫాన్ పునరావాస కేంద్రాలకు తరలించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను తుఫాన్ పునరావాస కేంద్రాలకు తరలించాలని, వారికి నాణ్యమైన భోజనం, వసతి అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తుపాన్ కారణంగా జరిగిన పంట నష్టం అంచనాలను అధికారులు తుపాన్ అనంతరం రూపొందించాలన్నారు. తుపాన్ సమయంలో ప్రజలు ఇల్లు వదిలి బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ బొల్లపల్లి వినూత్న, డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


దెందులూరు : వరి పొలాలను పరిశీలిస్తున్న ఎంపీ

తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఎంపీ పర్యటన

దెందులూరు : జిల్లాలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మంగళవారం పర్యటించారు. ఉదయం జోరువానలోనే కొల్లేరు బయలుదేరిన ఎంపీ, కైకలూరు సమీపంలో మాదేపల్లి గ్రామంలో పంట పొలాల వద్ద రైతులతో మాట్లాడారు. కొల్లేరు సమీపంలో చెరువుల వద్ద ఆక్వా రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. కైకలూరు నుంచి ఉప్పుటేరు బ్రిడ్జి వద్దకు చేరుకున్న ఎంపీ ఉప్పుటేరు నీటి ఉధ తిని పరిశీలించారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన ఉండి ఎంఎల్ఎ, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతో కలిసి ఉప్పుటేరు ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడినుంచి కైకలూరు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన తుపాను పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. పునరావాసం పొందుతున్న వ్యక్తులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

దెందులూరులో తహశీల్దార్ పర్యటన

మొంథా తుపాను నేపథ్యంలో దెందులూరు తహశీల్దార్ బి.సుమతి మండలంలో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. బలమైన గాలుల కారణంగా దెందులూరు గ్రామంలో ఈదురుగాలులకు పడిపోయిన భారీ చెట్టును గ్రామ పంచాయతీ సిబ్బంది వారికీ తెలియజేసి జెసిబితో తొలగించారు. దెందులూరు-సోమవరప్పాడు గ్రామ శివారు వీరభద్రపురం గ్రామంలో రోడ్డు పక్కన గుడారాల్లో నివసిస్తున్న సుమారు పది కుటుంబాల వారితో మాట్లాడి స్వగ్రామాలకి పంపారు. సింగవరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన రిహబిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలించి, వారికి భోజనం, వసతి, వైద్య సదుపాయాలు కల్పించారు. గోపన్నపాలెంలో ఉన్న వ్యాయామ కళాశాలలో హాస్టల్‌ను పరిశీలించారు. సదరు హాస్టల్ ప్రిన్సిపల్‌తో మాట్లాడి హాస్టల్ భవనం సరిగా లేకపోవడంతో విద్యార్థులను గోపన్నపాలెం హైస్కూల్ ఆవరణలోకి తరలించాలని తెలిపారు.


ద్వారకాతిరుమల : సమీక్షిస్తున్న ఎంఎల్ఎ

పడిపోయిన వరిచేలు పరిశీలన

మండలంలోని పోతు నూరు, కొవ్వలి, దోసపాడు గ్రామాల్లో పడిపోయిన వరి చేలను వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ హబీబ్‌భాషా, దెందులూరు మండలం వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరాజు, పోతునూరు కోపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ బొడ్డేటి మోహన్, నాయకులు లక్ష్మణ్ వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పరిశీలించారు. దెందులూరు పశువైద్యశాల ఎదుట ఈదురు గాలులకు పడిపోయిన చెట్టు జెసిబితో తొలగించేందుకు జూనియర్ అసిస్టెంట్ అనూష ఆధ్వర్యంలో డ్రెయిన్‌లో నీరు దిగువ ప్రాంతానికి వెళ్లేందుకు పనులు చేయించారు. గ్రామంలో వివిధ ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను ట్రాక్టర్లతో తొల గించారు. సైఫన్ వద్ద రాకపోకలు నిలుపుదల చేస్తూ గ్రామస్థాయి ఉద్యోగులు కాపలా కాశారు.


ఏలూరు సిటీ : ప్రజలతో మాట్లాడుతున్న బడేటి

ప్రజలు అధైర్యపడొద్దు

ఏలూరు సిటీ : పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలు అధైర్యపడవద్దని ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య, నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు చెప్పారు. వారు మంగళవారం సాయంత్రం కమిషనర్ ఎ.భానుప్రతాప్, అదనపు కమిషనర్ డి.శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్, ఎంఇలతో కలిసి తంగెళ్లమూడి వంతెన వద్ద ఉన్న మెహర్ మసీదులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి వెళ్లారు. అక్కడ ఉన్న 50 కుటుంబాల వారిని కలిసి వారికి అందుతున్న సహాయక చర్యలు, మెడికల్ సహాయం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం లంకపేట ఆరో రోడ్డులో నివాసం ఉంటున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి, పునరావాస కేంద్రాలకు వెళ్లి సురక్షితంగా ఉండాలని తెలిపారు. ఈ పర్యటనలో ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్ ఉన్నారు.

ఎంఎల్ఎ రోషన్‌కుమార్ సమీక్ష

చింతలపూడి :మొంథా తుపాన్ ప్రభావంపై చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అధికారులతో సమీక్షించారు. రైతులకు, ప్రజానీకానికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అధికార యంత్రాంగం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, సహాయ, పునరావాస చర్యల్లో ఏ విధమైన లోపం, జాప్యం ఉండరాదని సూచించారు.

ఏలూరు స్పోర్ట్స్ : పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్

ప్రజల సంరక్షణ పోలీసుల బాధ్యత : ఎస్‌పి

ఏలూరు స్పోర్ట్స్ :జిల్లా ప్రజల సంరక్షణ పోలీసుల బాధ్యతని, ప్రజలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, పోలీసు శాఖ తుపాన్ ముందస్తు చర్యలు చేపట్టిందని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. మొంథా తుపాన్ నేపథ్యంలో నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఎస్‌పి పర్యవేక్షిస్తున్నారు. కంట్రోల్ రూమ్‌లో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన కూడళ్లలో సిసి టీవీ కెమెరాలను అనుసంధానించారు. డ్రోన్లకు సంబంధించిన విజువల్స్ కూడా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి చూసేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్లో తుపానుకు సంబంధించి క్విక్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు చేయాలని ఆయన ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఈ క్విక్ రెస్పాన్స్ టీమ్ ఏదైనా ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెంటనే చేరుకునే విధంగా సిద్ధంగా ఉంటుంది. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో 112కు సమాచారం ఇవ్వడం ద్వారా వెంటనే పోలీసుల సహాయం అందుతుందని చెప్పారు.

ఉంగుటూరు :మొంథా తుపాన్ నేపథ్యంలో ప్రజల ఆస్తి, ప్రాణాలకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిందని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మంగళవారం ఆయన నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ముఖ్యంగా ఈదురుగాలుల వల్ల విద్యుత్ సరఫరాలో ఆటంకం, చెట్లు పడిపోతే తీసుకోవాల్సిన యుద్ధప్రాతిపదిక చర్యలపై నారాయణపురం విద్యుత్ ఉపకేంద్రంలో డివైఇఇ రాళ్లపల్లి భీమేశ్వరరావు, ఎఇ శ్రీరామ్, ఇతర అధికార, సిబ్బందితో కలిసి సమీక్షించారు. జాతీయ రహదారుల్లో కటవుట్‌లు, భారీ హోర్డింగులను తొలగించాలని ఆదేశించారు. గ్రామాల్లో కూటమి నాయకులు అప్రమత్తంగా ఉంటూ అధికారులకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

మొంథా తుపాన్ ప్రభావం వల్ల నేలకొరిగిన , నీట మునిగిన వరి పంట పొలాలను జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కె. హబీబ్‌భాషా మంగళవారం పరిశీలించారు. ఉంగుటూరు మండలంలో 245 ఎకరాల్లో పంట నీట మునిగి ఉంది. అలాగే 325 ఎకరాల్లో నే లకొరిగింది. తుపాన్ ప్రభావం వల్ల కోతలు కోయరాదని, వాయిదా వేసుకో వాలని రైతులకు అవగాహన కల్పించారు. ఎడిఎ ఉషా రాజకుమారి, ఉంగుటూరు మండల వ్యవసాయాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

పోలవరం : పొలాలను పరిశీలిస్తున్న అధికారి

అధికారులతో ఎంఎల్ఎ సమీక్ష

ద్వారకాతిరుమల : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల స్థాయి అధికారులతో తుపాన్ ప్రభావంపై ముందస్తు, అనంతర చర్యలపై గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా అలసత్వం వ హించొద్దని, పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు అవసరమైన ఆహారాన్ని ద్వారకాతిరుమల ఆలయం వారు ఏర్పాటు చేస్తున్నారన్నారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు.

ప్రజల భద్రతే ప్రభుత్వ లక్ష్యం

టి.నరసాపురం :ప్రజల భద్రతే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి ఆరమిల్లి శ్రీనివాసరావు తెలిపారు. మొంథా తుపాన్ విజృంభిస్తున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా

జిల్లాల మధ్య రాకపోకలు నిలిపివేత

వాహనాలను సురక్షిత ప్రాంతాల్లో నిలుపుకోవాలి

ఏలూరు స్పోర్ట్స్ :ఏలూరు జిల్లాలోకి ప్రవేశించే భారీ, రవాణా, కమర్షియల్ వాహనాలు ప్రయాణించకుండా రోడ్ల పక్కనే నిలుపుదల చేయాలని, జిల్లాల మధ్య రాకపోకలు నిలిపివేస్తున్నామని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ మంగళవారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొంథా తుపాన్ తీవ్రత ఎక్కువ కావడంతో జిల్లాలో జాతీయ రహదారుల వెంబడి నడిచే వాహనాలను ఆయా వాహన యజమానులు, డ్రైవర్లు సురక్షిత ప్రాంతాల్లో పార్కింగ్ చేసుకోవాలని, ప్రయాణాలు నిలుపుదల చేసుకోవాలని తెలిపారు. వాహనదారులు గమనించి స్వీయ రక్షణ చర్యల్లో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.

ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలోని జలవాగు, ముగ్గురాళ్ల వాగు, ఎర్ర కాలువలను ఆయన మంగళవారం మండల అధికారులతో కలిసి పరిశీలించారు. అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాలను సందర్శించి తుపాన్ సమయంలో పాటించాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.వెంకటేశ్వరరావుకు, సిబ్బందికి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

ఉంగుటూరు : విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ధర్మరాజు

ముసునూరు :అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. మండల పరిధిలోని చెక్కపల్లి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ కూలీలతో, గ్రామస్తులతో తుపాన్ ప్రభావం వల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు, ఉపాధి హామీ ఎపిఒ టి.రోజ్‌లీలా, పంచాయతీ సెక్రటరీ, విఆర్ఒ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : పొలాన్ని పరిశీలిస్తున్న ప్రియాంక

పొలాల పరిశీలన

బుట్టాయగూడెం : మండలంలోని నూతి రామన్నపాలెం గ్రామంలో పంటలను మండల వ్యవసాయాధికారి ప్రియాంక పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా వరి పంటలో వచ్చే ఇబ్బందుల గురించి స్థానిక రైతులతో మాట్లాడి తగు సూచనలు ఇచ్చారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

పోలవరం : తుపాన్ ప్రభావం వల్ల కొనసాగుతున్న అధిక వర్షాల కారణంగా వరి పంటలకు నష్టం జరగకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్య వసాయాధికారి కె. రాంబాబు సూచించారు. ఈ సందర్భంగా వ్య వసాయఅధికారి రాంబాబు మాట్లాడుతూ వరి పొలాల్లో నీరు నిల్వ ఉండకూడదని, సా ధ్యమైనంత త్వరగా మురుగునీరు బయటకు పోయే ఏర్పాట్లు చేయాలని రైతులకు సూచించారు. గాలులకు పడిపోయిన వరి కంకులను లేపి కట్టలుగా కట్టాలని, చేలు ఆరిన తర్వాత ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేస్తే గింజలు మొలకెత్తకుండా నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత పట్టిసీమ సొసైటీ అధ్యక్షులు నూనకాని రాంబాబు, ఉపాధ్యక్షుడు ధర్మేంద్ర పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

జీలుగుమిల్లి : మొంథా తుపాన్ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రాణ నష్టం లేకుండా చూడాలని, ఆస్తి నష్టం తగ్గించాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ఆదేశించారు. మండలంలోని బర్రింకలపాడు ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాన్ తీరం దాటే క్రమంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, నియోజకవర్గ పరిధిలోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తుపాన్ దృష్ట్యా క్యాంపు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఉంగుటూరు : పొలాలను పరిశీలిస్తున్న హబీబ్‌భాషా

పొంగి పొర్లుతున్న ఉప్ప వాగు

ముసునూరు : తుపాన్ వల్ల వాగులు, వంకలు పొంగి పొర్లడంతో ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి, తహశీల్దార్ డి.ప్రశాంతి తెలిపారు. మండలంలోని లోపూడి గ్రామం నుంచి ఎర్రవారిగూడెం వెళ్లే ఆర్అండ్‌బి ప్రధాన రహదారిపై ఉప్ప వాగు పొంగిపొర్లుతుంది. దీంతో రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా ముసునూరు పోలీసు వారి సహకారంతో, తహశీల్దార్, ఎంపిడిఒ ఏసుబాబు పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా తుపాన్ ప్రమాదం జరిగినట్లయితే వెంటనే 112కు కాల్ చేయాలని తెలిపారు.

పునరావాస కేంద్రాలకు జాలర్ల కుటుంబాలు

టి.నర్సాపురం :మండలంలోని బొర్రంపాలెం గ్రామ పరిధిలోని ఎర్రకాలువ జలాశయం దగ్గరలో ముత్యాలమ్మపేటలో నివసిస్తున్న జాలరుల కుటుంబాలను పోలీసులు, రెవెన్యూ, స్థానిక నాయకుల సహకారంతో మంగళవారం బొర్రంపాలెం హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. స్థానికుల సహకారంతో గర్భిణులను, చిన్నపిల్లలను, వృద్ధులను సురక్షిత ప్రదేశాలకు తరలించామని ఎస్ఐ ఎస్ఐ ఎం.జయబాబు, తహశీల్దారు టి.సాయిబాబా తెలిపారు. వారితో పాటు జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు, టిడిపి నాయకులు గండబోయిన శ్రీను, వెంకట్రావు, తదితరులు ఉన్నారు.

ఆహార పదార్థాలు అందజేత

ముదినేపల్లి :మొంథా తుపాన్ హెచ్చరిక నేపథ్యంలో ప్రొద్దువాక గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఎంపిపి సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ముంపునకు గురైన ప్రజలందరికీ ఆహార పదార్థాలు, బ్రెడ్, భోజనం, పండ్లు ఉచితంగా అందించి యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు రోజుల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాలనీవాసులకు సూచించారు. మండల రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది, అధికారులు అందుబాటులో ఉండాలని, ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని ఎంపిపి సత్యనారాయణ ఆదేశించారు.

పునరావాస కేంద్రాలు ఏర్పాటు

టి.నర్సాపురం : జాలర్ల కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలిస్తున్న అధికారులు

వడాలి పునరావాస కేంద్రం పరిశీలన

వడాలి గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తుపాన్ పునరావాస కేంద్రంలో ఉన్న 120 మంది బాధితులను టిడిపి నియోజవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు మంగళవారం పరామర్శించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశోధించి వారికి ఏర్పాటు చేసిన భోజనాలను వడ్డించి ఎటువంటి విపత్కర పరిస్థితులైన ఎదుర్కొనేందుకు సిఎం చంద్రబాబు ఉన్నతాధి కారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. అండగా నిలబడ తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మరీదు హనుమంతు, నక్క అప్పారావు, గుర్రపు బాబి, విఆర్ఒ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి వై.శ్యాంసుందర్, వైద్య అధికారులు డాక్టర్ శాంతిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

భాస్కరరావుపేటలో పునరావాస కేంద్రం ఏర్పాటు

కలిదిండి :మండలంలోని భాస్కరరావుపేటలో ముంపు ప్రాంతం, పూరిగుడిసెల్లో నివాసం ఉంటున్న సుమారు పది కుటుంబాల వారికి గ్రామ సచివాలయంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. కేంద్రంలో వసతులు, భోజన సదుపాయాలను సిపిఎం కార్యకర్తలు వీరవల్లి భాస్కరరావు, గద్దె అనిల్‌కుమార్, బుస్సా రామనాగేంద్రం, డి.వెంకటసత్యనారాయణ పర్యవేక్షించారు.

ఆపన్నులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి స్వచ్ఛంద సేవా సంస్థల వారు ముందుకు రావాలని స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు బలుసు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక తారక రామానగర్‌కు చెందిన ముప్పిడి విజయ్ ఇటీవల కాలంలో తలకు గాయమై తలలో రక్తం గడ్డ కట్టడంతో ఇంటి వద్దనే ఉంటూ చికిత్స పొందుతున్నాడు. విజయ్‌కు మెరుగైన వైద్యం చేయించాలని, ఆర్థికంగా ఆదుకోవాలని సోషల్ వర్కర్ ముప్పిడి చినబాబు నాగేశ్వరరావును కోరగా ఆయన స్పందించి విజయ్ తండ్రి సాల్మన్ రాజుకు రూ.ఐదు వేలు వైద్య ఖర్చుల నిమిత్తం అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ప్రవీణ్ కుమార్, షేక్ జహంగీర్ భాషా, వీసం జీవన్‌కుమార్, రాజేష్, కృష్ణబాబు, కిషోర్, పాల్గొన్నారు.

అనారోగ్య బాధితునికి సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని ఎంపిపి రాంబాబు, చింతలపూడి సొసైటీ ఛైర్మన్ రామారావు అన్నారు. చింతలపూడిలో టైలర్‌గా జీవనం సాగిస్తున్న పొదిలి భాగ్యరాజ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతనికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పోషణ చాలా ఇబ్బందిగా ఉండడంతో సహాయం కోరగా వారు స్పందించి మొత్తం రూ.67,490 మిత్రుల ద్వారా అందించారు. సన్నిహితులు నగదు రూపంలో రూ.8500 అందించారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో వివరాలు అడిగి తెలుసుకుని ఎంఎల్ఎ రోషన్‌కుమార్ భాగ్యరాజుకు రూ.రెండు లక్షలు మంజూరు చేయించారు. ఎంఎల్ఎకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జాతర మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగరంలోని ప్రసిద్ధ తూర్పు వీధి గంగానమ్మ జాతర మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కొలుపుల కమిటీ ప్రకటించింది. మంగళవారం తూర్పు వీధి గంగానమ్మ ఆలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జాతర వివరాలను వెల్లడిస్తూ, కార్యక్రమ వివరాలతో కూడిన బ్రోచర్లను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖులు వంకినేని భానుప్రకాష్ మాట్లాడుతూ ఈ జాతర మహోత్సవం నగర ప్రజల సమిష్టి ఉత్సవమని, యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఎంఎల్ఎ బడేటి చంటి, మేయర్ నూర్జహాన్, కో-ఆప్షన్ సభ్యులు పెదబాబు తదితరులు అందిస్తున్న సహకారం ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు.

డాక్యుమెంట్స్ పోయినవి

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, కోమర్రు గ్రామం, కొల్లి నాగేశ్వరరావు గారి కుమారుడు, కొల్లి వెంకట సత్యనారాయణ అను నేను ఇల్లు మారినప్పుడు ఖాతానెం.200రు నందు రీసర్వేనెం.115-1రు లో య.0.88ట్లున్నూ, రీసర్వే నెం. 127రులో య.1.07ట్లున్నూ, రీసర్వే నెం. 1424రులో య.0.68ట్లు ఆస్థి గల పాసుపుస్తకం మరియు టైటిల్ డీడ్‌ను తీసుకొని ది. 20-10-2025 తేదీన ముదినేపల్లి గ్రామంలో జిరాక్స్ తీయించుటకు బైక్‌పై వెళ్ళి తిరిగి వస్తుండగా నా యొక్క పాసుపుస్తకం మరియు టైటిల్ డీడ్ ఎక్కడో జారిపోయినవి. ఎంత వెదికినా దొరకలేదు. దొరికిన వారు యీ క్రింది అడ్రస్సుకు పంపించగలరు. పంపిన వారికి తగిన పారితోషకం అందించబడుతుంది. వీటిని ఉపయోగించి ఎటువంటి లావా దేవీలు జరిపినను, జరిపినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.

కొల్లి వెంకట సత్యనారాయణ
తండ్రి: నాగేశ్వరరావు, డోర్ నెం.2-58
కోమర్రు, ముదినేపల్లి మండలం ఏలూరుజిల్లా
సెల్ నెం. 94903 38172

IN THE COURT OF THE IV ADDITIONAL DISTRICT JUDGE, TANUKU
O.S.No. 62/2016

Between:
Muppidi Kotamma and another ...**Plaintiffs**
And
The District Collector and others ...**Defendants**

వాది తరపున చేసిన ప్రకటన

12 వ ప్రతివాది:
కర్రి మంగమ్మ, W/o. వెంకటరెడ్డి, స్త్రీ, గృహిణి, D.No: 14-13-2, ఓగిడి గ్రామం, పెనుమంట్ర మండలం.

పై నెంబరు దావా గ్రంధములో 12 వ ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపించినను, మీకు అమలు జరగనందున, శ్రీ కోర్టు వారి ఆదేశం ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 31-10-2025 వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేయవలసినది గాను, అట్లు కాని యెడల శ్రీ కోర్టు వారు పై నెంబరు దావా గ్రంధమును మీ పై పరోక్షమున తీర్మానించుదురని ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది.

Kamarsu Srinivasa Rao
IDL Kiranmai
Tanuku — Advocates, Tanuku
Dt. 28-10-2025 — Cell: 9346761569, 9701784630

మహారాజశ్రీ 3వ అదనపు (మొబైల్) జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఏలూరు
ఓ.యస్.నెం.360/2025

బిట్వీన్:-
శ్రీమతి. మానేపల్లి మమతా విశాలాక్షి ...పిటీషనర్/వాది
మరియు
శ్రీ కె.హెచ్.యల్.యస్.యస్.వి. మురళీ నాగరాజు యలియాస్ మురళీ రాజ్ ...రెస్పాండెంట్

పిటీషనరు/వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో రెస్పాండెంటు అయిన శ్రీ. కె.హెచ్.యల్.యస్.యస్.వి. మురళీ రాజ్, తండ్రి: రామచంద్రరావు, డోర్.నెం. 4-20-30, అగ్రహారం, ఏలూరు-1, ఏలూరు జిల్లా అను వారికి **ది. 12-11-2025వ తేది ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టులో స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి తమ ఆక్షేపణలు తెలియ పర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు దావాను తమ పరోక్షమందు విచారించి తీర్మానం చేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

గెళ్ళ శ్రీనివాసరావు
గెళ్ళ సాయి అనూష
ఏలూరు — అడ్వకేట్స్, ఉప్పు వారి వీధి,
ది.28-10-2025 — ఎన్.ఆర్. పేట్, ఏలూరు